బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

గోపాలపేట, నవంబర్ 3: మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు శ్రావణ్‌కుమార్ కుమారుడు (2నెలల బాలుడు) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ పాత్లావత్ హర్యానాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాలరాజు, రైతుబంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు తిరుపతియాదవ్, మాజీ సర్పంచ్ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ శేఖర్ గౌడ్, కోఆప్షన్ సభ్యుడు మతీన్, నాయకులు రవి, మణ్యంనాయక్, లక్ష్మయ్య, శేఖర్ తదితరులు ఉన్నారు.

శ్రావణ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

శాఖాహారంతోనే ఆరోగ్యం పదిలం

అయిజ, నవంబర్ 3 : శాఖాహారంతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకులు ఆంజనేయులు, కొండాలు పేర్కొన్నారు. పట్టణంలోని శివాంజనేయ ధ్యాన పిరమిడ్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించి, ధ్యాన పిరమిడ్ కేంద్రానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిరమిడ్‌లో ధ్యానం చేయడంతో మూడు రెట్ల శక్తిని అధికంగా పొందవచ్చన్నారు. మాంసాహారం పాప హారమని, జీవులను చంపే హక్కు ఎవరికీలేదన్నారు. అనంతరం శాఖాహారం వినియోగించడం వల్ల కలిగే లాభాలను వివరించారు. అనంతరం స్వయంభూ కట్టకింద తిమ్మప్ప స్వామి ఆలయ సమీపంలో శివాంజనేయ పిరమిడ్ ధ్యాన కేంద్రానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సైతయ్య, ప్రభాకర్, రామకృష్ణ, ఉపేంద్ర, శ్రీనివాస్, చంద్రశేఖర్ గౌడ్, సర్వ మంగలమ్మ, పరశురాం, రవికుమార్, ప్రభావతి, నీరజ, శివరాములు, వెంకటేశ్వర్లు, ఉమేశ్‌గౌడ్, జ్ఞానేశ్వరి, స్వప్న, హనుమన్న తదితరులు పాల్గొన్నారు.

శాఖాహార ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ ధ్యాన కేంద్ర నిర్వాహకులు

అయ్యప్ప భక్తులకు నిత్యాన్నదానం

మదనాపురం, నవంబర్ 3: కొత్త కోట, మదనాపురం (ఉమ్మడి మండలాలు) అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి యేడాది కార్తీకమాసం అయ్యప్ప దీక్షాదారులకు ఏర్పాటు చేసే అన్నదాన కార్యక్రమం ఆదివారం కొత్తకోటలోని భూతనాథ అయ్యప్ప అన్నదాన క్షేత్రంలో సేవా సమితి వ్యవస్థాపకుడు గోపాలకృష్ణ గురుస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమం నవంబర్ 3నుంచి జనవరి 14 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ గురుస్వామి మాట్లాడుతూ.. ఈ ప్రాంత దీక్షాదారులతోపాటు ఉత్తర తెలంగాణ ప్రాంతం నుంచి శబరిమల యాత్రకు వెళ్లే పాదయాత్ర స్వాములు, వాహనాల్లో వెళ్లే యాత్రికులు, తిరుగు ప్రయాణంలో స్వస్థలాలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వంచనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ దాదాపు 300 నుంచి 500మంది అయ్యప్పలకు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. 11ఏండ్లుగా అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు, గురుస్వాములు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గోపాలకృష్ణ గురుస్వామి

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

గోపాలపేట, నవంబర్ 3: అచ్చంపేట మండలంలోని ఉమామహేశ్వర క్షేత్రంలో మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన ఆంజనేయస్వామి భక్తులు మాలధారణ చేశారు. ఆదివారం స్వాములు బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన 20మంది భక్తులు ఉమామహేశ్వర క్షేత్రంలో హనుమాన్ దీక్షా పీఠాధిపతులు కేతావత్ జయరాం గురుస్వామి ఆధ్వర్యంలో మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి హనుమాన్ దీక్షా మాలధారణ చేసినట్లు వారు తెలిపారు.

ఆలయంలో పూజలు చేస్తున్న మాలధారులు

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మల్దకల్, నవంబర్ 3: మండలంలోని నీలిపల్లికి చెందిన వెంకటేశ్ గౌడ్ అనారోగ్యంతో నాలుగు రోజులు కిందట మృతి చెందాడు. 1997-98 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు విషయం తెలుసుకున్న వెంటనే ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థిక పరిస్థితి బాగా లేదని తెలియడంతో మిత్ర బృందం ఆధ్వర్యంలో రూ.25వేలు నగదును అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. వీరికి భవిష్యత్‌లో అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బసవరాజు, నర్సింహయ్యశెట్టి, రాఘవేందర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్‌శెట్టి, శేఖర్, మహేశ్వరప్ప, తిమ్మప్ప, భీమరాయుడు, ఆంజనేయులు, శివా డ్డి, మల్దకల్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్ర బృందం

వనపర్తి టౌన్: వినియోగదారుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు


అయిజ: విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏడీఈ గోవింద్

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- డీఈ శ్రీనివాసులు, ఎస్ఈ రాజశేఖరం
- విద్యుత్ వినియోగదారుల దినోత్సవానికి విశేష స్పందన

వనపర్తి టౌన్, నవంబర్ 3: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వనపర్తి డివిజనల్ ఇంజినీర్ శ్రీనివాస్, ఎస్ఈ రాజశేఖరం పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయ ప్రాంగణంలో డివిజన్ ఇంజినీర్ శ్రీనివాస్, ఎస్ఈ రాజశేఖరం ఆధ్వర్యంలో ఆదివారం విని యోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో విని యోగదారుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ మీటర్‌లో పేరు మార్పిడి గురించి, కొత్త మీటర్లు, స్తంభాల మార్పిడి, రోడ్డు విస్తరణలో రోడ్డుపై, కాల్వలోపల ఉన్న టువంటి స్తంభాలను డ్రైనేజీ కాల్వ రోడ్డువైపు మార్చాలని కోరినట్లు ఎస్ఈ, డీఈలు తెలిపారు. అదేవిధంగా రజకులు, నాయీబ్రాహ్మణులు, ఎస్టీలకు సంబంధించి పాత బకాయిల మాఫీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రిజిస్ట్రేషన్ లేని గృహాలకు కొత్త మీటర్లు ఇవ్వాలని కోరానని పేర్కొన్నారు. వినియోగదారులు అడిగిన సమస్యలపై అధికారులు వివరణ, అవగాహన కల్పించారు. సదస్సులో డివిజనల్ ఇంజినీర్ టెక్నికల్ రవీంద్రమోహన్, అకౌంట్స్ ఆఫీసర్ నిస్సిలు బకాయిల విషయంపై అవగాహన కల్పించారు. సమావేశానికి హాజరై సమావేశాన్ని విజయవంతం చేసినందుకు గృహ, వ్యాపారం, పరిశ్రమల, వ్యవసాయ, సంఘాల నాయకులకు ఎస్ఈ, డీఈలు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాది నాగేశ్వర్, నాగరాజు, శ్రీనివాస్, శ్రీను, ఆంజనేయులు, వ్యాపారులు, పరిశ్రమల యజమానులు, వ్యవసాయ విని యోగదారులు తదితరులు పాల్గొన్నారు.

అయిజ పట్టణంలో..

అయిజ, నవంబర్ 3 : విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అయిజ ఏడీఈ గోవింద్ అన్నారు. పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో ఆదివారం విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహించారు. అయిజ, గట్టు, మల్దకల్, రాజోళి మండలాల పరిధిలోని విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి రైతులు, గృహ విని యోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడుతామని ఏడీఈ వినియోగదారులకు సూచించారు. లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులపై రైతులు నేరుగా ఫిర్యాదు చేయాలని, వెంటనే సంబంధిత లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏఈలు నరేందర్, చెన్నయ్య, సందీప్, సబ్ ఇంజినీర్ శోభిత, గృహ, వ్యవసాయ విద్యుత్ విని యోగదారులు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతగా సాతాపూర్ జట్టు

విజేతగా నిలిచిన సాతాపూర్ జట్టు

దీపనగండ్ల, నవంబర్ 3: దీపావళి పండుగ గంగమ్మ జాతరను పురస్కరించుకొని మండల కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముంత మల్లయ్య, ముంత శివ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా శాతాపూర్ కబడ్డీ జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రూ.15వేలు, షీల్డ్ పొందగా.. ద్వితీయ స్థానంలో వనపర్తి జిల్లా పుల్గర్‌చర్ల కబడ్డీ జట్టు నిలిచి రూ.10వేలు, షీల్డ్ బహుమతులను పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణయ్య, బీరయ్య, గంగిరెడ్డి, కృష్ణయ్య, శివ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అయిజ, నవంబర్ 3 : తుంగభద్రా నది నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశారు. అలంపూర్ ఎస్సై వెంకటస్వామి కథనం మేరకు .. అలంపూర్ పట్టణానికి సమీపంలోని తుంగభద్రా నది నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో శనివారం రాత్రి 10గంటల సమయంలో రోడ్డుపై తనిఖీ చేయగా రెండు ట్రాక్టర్లు పట్టణంలోకి ప్రవేశిస్తుండగా డ్రైవర్ల తోపాటు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

రమాదేవిని సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్, నవంబర్ 3: చదువుతున్న పేద యువత ఇష్టపడి చదివి ఇటీవల డీఎస్సీలో ఎస్జీటీ ఉద్యోగం సాధించిన రమాదేవిని స్ఫూర్తిగా తీసుకొని ఉద్యోగాలు సాధించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరాం పిలుపిచ్చారు. మండలంలోని కేతేపల్లికి చెందిన కాకం చిన్న నారాయణ, శంకరమ్మ దంపతుల కుమార్తె కాకం రమాదేవి ఎస్జీటీ ఉద్యోగం సాధించడంతో ఆదివారం ఆమెను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణవేణి, వెంకటమ్మ, పెంటయ్య, కాశన్న పాల్గొన్నారు.

పాలం విషయంలో దాడిపై కేసు నమోదు

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 3 : పొలం విషయంలో దాడిపై కోదండాపూర్ పీఎస్ పరిధిలో కేసు నమోదైంది. ఎస్సై స్వాతి కథనం ప్రకారం పుటాపొడ్డి గ్రామానికి అన్నదమ్ములు అన్న నడిపి రామాంజనేయులు భార్య సుజాత, తమ్ముడు రామాంజనేయులు భార్య సరోజ కొన్ని రోజులుగా పొలం విషయంలో గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో అన్న నడిపి రామాంజనేయులు అతని భార్య సుజాత కలిసి సరోజపై దాడిచేసి దూషించారు. దీంతో సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీపీఎల్-ఎస్4 విజేతగా వీపీజీ లయన్స్ జట్టు

విజేతగా నిలిచిన ఆనందంలో వీపీజీ లయన్స్ జట్టు

దీపనగండ్ల, నవంబర్ 3: దీపావళి పండుగ గంగమ్మ జాతరను పురస్కరించుకొని మండల కేంద్రంలో నిర్వహించిన వీపీఎల్-ఎస్4(దీపనగండ్ల ప్రీమియం లీగ్-సీజన్4) విజేతగా వీపీజీ లయన్స్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచి షీల్డ్, రూ.20వేలు, ద్వితీయ స్థానంలో వారియర్ జట్టు షీల్డ్, రూ.15వేలు నిలిచి బహుమతులు సాధించారు. ఐదు రోజుల నుంచి నిర్వహించిన వీపీఎల్-ఎస్4 క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైనల్‌లో మ్యాచ్ డ్రాగా నిలిచినప్పటికీ సూపర్ సిక్స్ ఓవర్‌లో ప్రతిభను చాటి ప్రథమ విజేతగా వీపీజీ లయన్స్ జట్టు విజయం సాధించడంపై పలువురు అభినందించారు.

పరిశుభ్రత.. అందరి బాధ్యత

గద్వాలటౌన్, నవంబర్ 3: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి నిత్యం చేపడుతున్న పారిశుధ్య పనులను ఆదివారం తెల్లవారుజామున మున్సిపల్ కమిషనర్ దశరథ్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులకు పలు సూచనలు, సలహాలు చేశారు. పారిశుధ్యం లోపించకుండా చూడాలని సూచించారు. ముఖ్య కూడళ్లల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెప్పారు. అలాగే దుకాణాదారులు రోడ్లపై చెత్త వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. దుకాణాదారులు కూడా కార్మికులకు సహకరించాలని కోరారు. అలా కాకుండా రోడ్లపై ఇష్టానుసారంగా చెత్తవేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రజలు చెత్త వాహనాల్లో చెత్తను వేసి పట్టణ పరిశుభ్రతకు తోడ్పాటు అందించాలని కోరారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, జవాన్లు పాండు, పరమేశ్, గట్టన్న, భార్గవ్, నర్సింహ, మారుతి, చిన్న తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్మికులకు సూచనలిస్తున్న మున్సిపల్ చైర్మన్ కేశవ్

మార్షల్ ఆర్ట్స్‌లో రాణించిన విద్యార్థులు

మదనాపురం, నవంబర్ 3: మండలంలోని గోవిందహళ్లి (అగ్రహారం) గ్రామంలో ఆదివారం విద్యార్థులకు తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తకోట మండలంలోని పాలెం, మదనాపురం మండలంలోని గోవింద హళ్లికి చెందిన మొత్తం 50విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోవిందహళ్లి మాజీ సర్పంచ్ శ్రీనివాసులు హాజరై విద్యార్థులను అభినందించారు. విద్యతోపాటు విద్యార్థులు ఆత్మ రక్షణకు కరాటేలో కూడా రాణించాలన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు, బెల్ట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు రాములు, హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్, చందు, శాంతయ్య, రమేశ్, కరాటే మాస్టర్స్ పెంటన్నయాదవ్, నరేందర్‌సాగర్, శ్రీనుయాదవ్, నరేశ్నా యక్, రవి, శివ శంకర్, పరశురాం, రమేశ్ రెడ్డి, సంతోష్, గౌతమ్, శివయ్య, అంజి, రాము విద్యార్థుల ప్రతిభను అభినందించారు.

బెల్ట్‌లు, సర్టిఫికెట్స్ అందజేస్తున్న నాయకులు

తాసీల్దార్‌పై దాడి అమానుషం

- అధికార పార్టీ నేతను అరెస్ట్ చేయాలి
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు అజ్జపాగ లక్ష్మణ్

ఆత్మకూర్, నవంబర్ 3: విధినిర్వహణలో ఉన్న ఇటిక్యాల తాసీల్దార్ నరేందర్‌ను అకారణంగా దూషించి దాడి చేసిన అధికార పార్టీ నాయకులు ప్రభాకర్ రెడ్డిపై పోలీసులు తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు అజ్జపాగ లక్ష్మణ్, మండలాధ్యక్షుడు దండుకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆత్మకూర్ ప్రభుత్వ అతిథి గృహంలో వారు విలేకరులతో మాట్లాడారు. దళిత వర్గానికి చెందిన తాసీల్దార్ నరేందర్‌పై అధికార పార్టీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి చేసిన దాడిని ఎమ్మార్పీఎస్ నాయకులు ముక్తకంఠంతో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇటిక్యాల మండలంలోని ఒక గ్రామంలో ప్రత్యేక అధికారిగా ఉన్న తాసీల్దార్ నరేందర్‌పై నిబంధనకు విరుద్ధంగా మల్టీపుల్ వర్కర్స్‌ను మార్చి తాను చెప్పిన వారిని నియమించాలని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి తీవ్రంగా ఒత్తిడి చేయడంతో గ్రామసభ నిర్వహించి మల్టీపుల్ వర్కర్స్‌ను మార్చేం దుకు తీర్మానం చేయాలని ఎంపీడీవోకు ప్రత్యేక అధికారి నరేందర్ సూచించడంతో ఆగ్రహించిన ప్రభాకర్‌రెడ్డి నోటితో చెప్పలేని మాటలు తీడుతూ వాటర్ బాటిల్‌ను మీదకు విసిరి దళిత తాసీల్దార్‌పై దాడి చేయడం ఏమిటిని దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, లేకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు బాలమణ్యం, జానకీరాములు, మాసన్న, కురుమన్న, రాము, రాములు, సహదేవుడు తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

టీవీ అందజేస్తున్న దాత

సీసీ కెమెరాలకు టీవీ వితరణ

రేవల్లి, నవంబర్ 3 : మండలంలో నాగపూర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు మాజీ సర్పంచ్ వేముల సాయిబాబాగౌడ్ స్మారకార్థం కుటుంబ సభ్యులు కొండల్ గౌడ్ 40 ఇంచుల ఎల్‌డీ టీవీని ఎస్సై రాము ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రఘు యాదవ్, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాగుంట వెంకన్నకు ప్రత్యేక పూజలు

కేటీదొడ్డి, నవంబర్ 3: పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఆదివారం ఉదయం సుప్రభాత సేవ, మంగళాశాసనం, శాత్తుమొర నిర్వహించారు. ఉదయం 10గంటల తర్వాత నిత్య హోమం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, దేవతోద్వాసన, ధ్వజాప రోహణం, శాత్తుమొర, బ్రహ్మోత్సవ స్వస్తివచనం వంటి పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో భక్తులు బారులు దీరారు.

చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

ధర్మయుద్ధం మహాసభను విజయవంతం చేయాలి

అయిజ, నవంబర్ 3 : పాలమూరులో ఈనెల 7వ తేదీన నిర్వహించనున్న మాదిగల ధర్మయుద్ధం మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా.. సీఎం రేవంత్‌రెడ్డి ఏబీసీడీ వర్గీకరణ ఫలాలను ఉద్యోగ రంగాల్లో అవకాశం కల్పిస్తామని చెప్పి మోసం చేసినందుకు నిరసనగా ధర్మయుద్ధం మహాసభను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు, ప్రభాకర్, మారెన్న, దేవరాజు, కల్యాణ్, రమేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గట్టు మండలంలో..

గట్టు, నవంబర్ 3: మాదిగల ధర్మ యుద్ధమహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఏసన్నమాదిగ పిలుపునిచ్చారు. మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం మండలంలోని చాగదోణ, లింగాపురం, బోయల గుట్టెం, ఇందువాసి తదితర గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో నాయకులు బండారి తూం డేవిడ్ మాదిగ, శంకరన్న, కిశోర్, భాస్కర్, భీమేశ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ రాజేశ్

గట్టు: నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బీసీ కులగణనకు అధికారుల నియామకం

గట్టు, నవంబర్ 3: మండలానికి సంబంధించి బీసీ కులగణన కార్యక్రమానికి అధికారులను నియమించారు. కులగణన ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండలంలో 27 జీపీలకు ఎన్యుమరేటర్లుగా ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీలు, ఈజీఎస్ ఈసీ, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీలను నియమించారు. సూపర్‌వైజర్లుగా మండల పరిషత్ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్, ఎంఏవో, ఎంపీవో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఈసీ, ఐకేపీ ఏపీఎం, ఆర్ఐలు, ఈజీఎస్ ఏపీవోలను నియమించారు. వీరందరూ కులగణనలో పాల్గొనున్నారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వ్యక్తులపై కేసునమోదు

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 3 : చికెన్‌వేస్టేజ్‌ను అక్రమంగా వాహనంలో తరలిస్తున్న వారిపై కేసునమోదు చేసిన ఘటన కోదండాపూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై స్వాతి కథనం ప్రకారం ఆదివారం ఉదయం 11గంటలకు ధర్మవరం స్టేజీ వద్ద విధులు నిర్వర్తిస్తున్న బ్లూకోర్టు సిబ్బంది కర్నూల్ నుంచి కొండేరు గ్రామానికి బొలెరో వాహనంలో చికెన్‌వేస్టేజ్ తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పవన్‌కల్యాణ్ , జక్కయ్యపై కేసున మోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రేమ వివాహం తగాదాలో యువకుడిపై దాడి

ధరూరు, నవంబర్ 3: ప్రేమ వివాహానికి సంబంధించిన గొడవలో యువకుడిపై అమ్మాయి తరపు వాళ్లు దాడి చేసిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. మండలంలోని జాంపల్లికి చెందిన నరేశ్ బంధువు, అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అమ్మాయి తరపు వాళ్లు నరేశ్‌ను దీపావళి రోజు ఇంట్లో పెద్దలకు నైవేద్య పూజలు చేస్తుండగా దాడిచేసి గాయపర్చారని వాపోయాడు. దీనిపై ఎస్సై అబ్దుల్ షుకూర్‌ను వివరణ కోరగా.. నరేశ్‌పై దాడి చేసినట్లు ఫిర్యాదు రాగా.. దవాఖానలో యువకుడిని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మండల సభలను విజయవంతం చేయాలి

పాన్‌గల్, నవంబర్ 3: మండలకేంద్రంలో సోమవారం నిర్వహించనున్న సీపీఎం 8వ మండల మహాసభలను విజయవంతం చేయాలని బాల్యానాయక్ అన్నారు. ఆదివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి మహాసభలకు సంబంధించిన ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ మాట్లాడుతూ.. మహాసభలకు రాష్ట్ర నాయకులు జాన్‌వెస్లీ, సాగర్, జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వేణుగోపాల్, భగత్, భీమయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ: వ్యక్తికి గాయాలు

వనపర్తి టౌన్, నవంబర్ 3: ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయలైన ఘటన మండలంలోని రాజపేటలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తకోటకు చెందిన వ్యక్తి బైకుపై వనపర్తి నుంచి కొత్తకోటకు వెళ్తుండగా అదే సమయంలో కొత్తకోట ఉంచి వనపర్తికి వెళ్తున్న కారు బలంగా ఢీకొన్నాయి. ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా బాధితుడిని స్థానికులు జిల్లా దవాఖానకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఘనంగా గంగమ్మ ఉత్సవాలు

అమ్మవారి ఊరేగింపులో భక్తులు

దీపనగండ్ల, నవంబర్ 3: మండల కేంద్రంలోని గంగమ్మ జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గంగమ్మ ఆలయం నుంచి అమ్మవారి ఊరేగింపు ర్యాలీ నిర్వహించారు. గొల్ల సుద్దులచే ఒగ్గు కథలు చెప్పుతూ డోలుడప్పులతో ర్యాలీ నిర్వహిస్తూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యువకులు సంతోషంగా పటాకులు కాలుస్తూ గంగమ్మ దేవతకు స్వాగతం పలుకుతూ సంబురాలు జరుపుకొన్నారు. కుటుంబ సభ్యుల తోపాటు బంధుమిత్రులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక పాల్గొనడంతో గ్రామంలో పండుగ సందడి నెలకొన్నది. చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో పిల్లా పెద్దలు వస్తువులు కొనుగోలు చేసేపనిలో నిమగ్నమయ్యారు.